నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | బుధవారం 22 మే 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

బోనస్ అంటూ బోగస్ మాటలు

సీఎం రేవంత్‌రెడ్డి మాటలు నమ్మొద్దు

- 'చింతపండు'ను చిత్తుగా ఓడించాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- గ్రాడ్యుయేట్ ఎన్నికలు కాంగ్రెస్‌కు చెంపపెట్టు
- రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

హనుమకొండ, మే 21: సన్న వడ్లకు బోనస్ అంటూ బోగస్ మాటలను మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రజలు నమ్మొద్దని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లతో కలిసి ఎర్రబెల్లి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దొడ్డు వడ్లను కూడా కొంటామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు సన్నవడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామంటున్నాడని అన్నారు. సీఎం బోగస్ మాటలను ప్రజలు ఎవ్వరూ నమ్మొద్దన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయకుండా గ్రాడ్యుయేట్ ఎన్నికల ముందు మరోసారి మోసం చేయాలనే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కేంద్ర ప్రభుత్వం దొడ్డు వడ్లు కొనకున్నా అప్పటి సీఎం కేసీఆర్ ప్రతి గింజనూ కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచారని తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు కాగానే ఇచ్చిన హామీలను మరిచి దాటవేస్తున్నారని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తామంటూ కొత్త నాటకం ఆడుతున్నారన్నారు. దొడ్డు వడ్లను ఎక్కువగా సాగు చేస్తారని, ఇంటి అవసరాల కోసం మాత్రమే సన్నవడ్లను రైతులు సాగుచేస్తారని తెలిపారు. సన్న వడ్లకు మార్కెట్‌లో రూ.3వేలకు పైగా ధర వస్తుంటే తక్కువగా ఉన్న ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరకు రైతులు కొనుగోలు కేంద్రాల్లో అమ్మరని చెప్పారు. 20 శాతం మాత్రమే సాగయ్యే సన్న వడ్లకు బోనస్ ఇచ్చి, దొడ్డు వడ్లకు ఇవ్వకపోవడం అంటే రైతాంగాన్ని మోసం చేసినట్లేనని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వంకతో ప్రజలను ఇబ్బందులు పెట్టారని తెలిపారు. రెండు నెలల నుంచి కల్లాల్లో ధాన్యం ఉండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. జిల్లాల అభివృద్ధిని పట్టించుకోకుండా జిల్లాలను తగ్గిస్తానని అంటున్నారని, ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. వరంగల్ – ఖమ్మం – నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చింతపండు నవీన్‌ను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. విద్యావంతుడు, యువకుడు, ప్రశ్నించేతత్వం ఉన్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు తెలంగాణ రాజకీయాలకు మలుపు

వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపు తెలంగాణ రాజకీయాలకు మలుపు అవుతుందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి చింతపండు నవీన్‌కు ఓటు వేయకుండా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని పెద్దల సభకు పంపాలని, గ్రాడ్యుయేట్స్ ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఐదు నెలల్లో విఫలమైన కాంగ్రెస్‌కు ఎమ్మెల్సీ ఎన్నిక చెంపపెట్టు కావాలన్నారు. రాకేశ్‌రెడ్డి గెలిస్తే మండలిలో ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశం ఉంటుందన్నారు. హనుమకొండ జడ్పీ చైర్మన్ డాక్టర్ మారపెల్లి సుధీర్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, వొడితెల సతీశ్‌కుమార్, రసమయి బాలకిషన్, సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తాళ్లపల్లి జనార్దన్‌గౌడ్, జోరిక రమేశ్, వీరేందర్, రామ్మూర్తి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు నేడు కేటీఆర్ రాక

హనుమకొండ/ ములుగు రూరల్: బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి గెలుపు కోరుతూ బుధవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఉదయం నర్సంపేట పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో గ్రాడ్యుయేట్స్ సభ ఉంటుందని, మధ్యాహ్నం 3 గంటలకు వరంగల్‌లోని నాని గార్డెన్స్‌లో వరంగల్ తూర్పు నియోజకవర్గ గ్రాడ్యుయేట్స్, సాయత్రం 4గంటలకు హంటర్‌రోడ్డులోని సీఎస్ఆర్ గార్డెన్స్‌లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ గ్రాడ్యుయేట్స్ సమావేశంలో పాల్గొంటారని వివరించారు. ములుగులోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి కేటీఆర్ పాల్గొంటారని జడ్పీ చైర్‌పర్సన్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి తెలిపారు. గ్రాడ్యుయేట్స్ పెద్ద సంఖ్యలో పాల్గొని సభలను విజయవంతం చేయాలని కోరారు.

వరంగల్ రైతు డిక్లరేషన్‌కు మంగళం

- సన్నవడ్లకే రూ.500 బోనస్ దగా
- మ్యానిఫెస్టోకు భిన్నంగా కాంగ్రెస్ నిర్ణయాలు
- పట్టభద్రులు ఆలోచించి ఓటేయాలి
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మాట్లాడుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, మే 21(నమస్తే తెలంగాణ) : రైతులు పండించే ధాన్యానికి మద్దతు ధరకు అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ అంటూ వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ప్రకటించిన కాంగ్రెస్ ఇప్పుడు మ్యానిఫెస్టో అంశాలపై మాట మారుస్తున్నదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ధ్వజమెత్తారు. మ్యానిఫెస్టోలో భాగంగా వరంగల్‌లో విడుదల చేసిన బుక్‌లెట్ పేజీ నంబర్ 8లో రైతులకు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు సన్నవడ్లకు మాత్రమే అంటూ మడత పేచీ పెడుతున్నదని మండిపడ్డారు. మంగళవారం జనగామలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధాన్యానికి రూ.2,183 ఉంటే రూ.2,683, మక్కజొన్నకు రూ.1,870 ఉంటే రూ.2,200, కందులకు రూ.6,300 ఉంటే రూ.6,700 ఇలా ప్రతి పంటకు ఎంత ఇస్తామన్నది కాంగ్రెస్ పార్టీ నమ్మబలికిందన్నారు. రైతు డిక్లేరేషన్‌లో సన్నవడ్లు అని గానీ.. దొడ్డు వడ్లు అని కానీ పేర్కొనలేదని, మొన్న పేపర్‌లో లీక్ ఇస్తే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ధాన్యంపై కాంగ్రెస్ అబద్ధం చెబుతుందని స్పష్టంగా చెప్పారన్నారు. బోనస్‌పై బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేస్తే మీరు అనవసరంగా ఆందోళనలు చేస్తున్నారు.. సీఎం రేవంత్ సన్నవడ్లకే బోనస్ అని అనలేదని, అలాంటి ఉద్దేశం లేదని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ మీడియా సమావేశంలో చెప్పారని గుర్తుచేశారు. అంటే పూట కో మాట మాట్లాడి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు పండించే ధాన్యంపై అసలు అవగాహనే లేదని, రాష్ట్రంలో 3కోట్ల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పండిస్తుంటే ప్రభుత్వం కొనుగోలు చేసేది రెండు సీజన్లకు కోటీ 30నుంచి కోటీ 40లక్షలు సేకరిస్తారన్నారు. కొనేదాంట్లో వచ్చేది 10 నుంచి 20శాతం మాత్రమే సన్నవడ్లు వస్తాయని అన్నారు. సన్నవడ్లు డిమాండ్ ఉన్న తెలంగాణ సరిహద్దులోని సత్తుపల్లి, వైరా, కోదాడ, మిర్యాలగూడ, కర్నాటక సరిహద్దులోని ఆలంపూర్, గద్వాల సహా మహారాష్ట్ర సరిహద్దులోని బాన్సువాడ, బోధన్ ప్రాంతాల్లోనే వేస్తారన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి..

అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని వాయిదాలు వేస్తూ, మద్దతు ధరతో పాటు బోనస్ ఇస్తామని మాటమార్చి రైతాంగాన్ని వంచిస్తున్న కాంగ్రెస్ పార్టీకి బుద్ధి రావాలంటే ఓటు అనే ఆయుధాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత జనగామ ప్రాంతంలో పంటల దిగుబడి 10 రెట్లు పెరిగిందని, 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండుతున్నదన్నారు. కేసీఆర్ పాలనలోనే కరువు ప్రాంతంగా ఉన్న జనగామ సుభిక్షంగా మారిందన్నారు. ఇటీవల మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం వరి అధికంగా పండించే జనగామ రైతులకు ఆశనిపాతంలా మారిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే డిసెంబర్ 9న రూ.2లక్షల రుణ మాఫీ ఒకేసారి అవుతుందని ఆశపడ్డారన్నారు. ఆ తర్వాత మాట మార్చి మళ్లీ ఆగస్టు 15 అంటూ హామీ ఇచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతు రుణమాఫీ కోసం కార్పొరేషన్ ఏర్పాటు అనేది పెద్ద మోసం అని మండిపడ్డారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, కౌన్సిలర్లు గాడిపెల్లి ప్రేమలతరెడ్డి, తాళ్ల సురేశ్‌రెడ్డి, దేవరాయి ఎల్లయ్య, మార్కెట్ మాజీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, రైతుబంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పసుల ఏబేల్, గద్దల నర్సింగరావు, బైరగొని యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

నర్సంపేటలోని ఆటో స్టాండ్‌లో నిలిచి ఉన్న ఆటోలు, కార్మికులు

ఆటోవాలా.. బతుకు డేలా!

కాంగ్రెస్ సర్కారు నిర్ణయంతో ఆగమైన డ్రైవర్లు • 'ఉచిత బస్సు'తో డ్రైవర్లకు తగ్గిన గిరాకీ

- కుటుంబ పోషణ, పిల్లల చదువుపై భారం
- ఆర్థికంగా నష్టపోయి అప్పులపాలు
- నెలవారీ కిస్తీలు కట్టలేక దిగాలు
- ప్రభుత్వమే న్యాయం చేయాలని వేడుకోలు

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆటో కార్మికుల బతుకులు రోడ్డున పడ్డాయి. గిరాకీలు తగ్గడంతో రోజువారీ సంపాదన బాగా తగ్గిపోయి ఆటోలు అమ్ముకొని రోజు కూలీలుగా మారుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఫ్రీ బస్సు నిర్ణయంతో ఆటో నడిస్తేనే పూట గడిచే వేలాది మంది కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జిల్లాకేంద్రాలు సహా వివిధ మండల కేంద్రాలు, ముఖ్యమైన గ్రామాల్లో నిత్యం వందలాది ఆటోలు తిరుగుతుంటాయి. పురుషులకు బైక్‌లు, ఇతర వాహనాల్లో ప్రయాణిస్తుంటారు.. కానీ మహిళలు మాత్రం ఆటోలపై ఆధారపడుతారు. గ్రామాలు, మండల కేంద్రాల నుంచి ఎక్కువగా ఆటోలో ప్రయాణించే వారు మహిళలు మాత్రమే. అయితే ఆర్టీసీ ఉచిత ప్రయాణంతో మహిళలు ఆటోలు ఎక్కడం లేదు. ఫలితంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలాది మంది కార్మికుల ఉపాధిపై ప్రభావం చూపుతున్నది. అద్దెకు ఆటోలు తీసుకొని నడుపుకునే వారి పరిస్థితి మాత్రం చాలా దారుణంగా తయారైంది. కనీసం పెట్రోల్, డీజిల్ చార్జీలు, కూలీ కూడా రావడం లేదని వాపోతున్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభం కానుండడంతో పిల్లల స్కూల్స్ ఫీజులు, పుస్తకాలు, డ్రెస్సులు, బ్యాగులు, బూట్లు తదితర సామగ్రి కొనుగోలు చేసేందుకు చేతిలో డబ్బులు లేవని ఆందోళన చెందుతున్నారు. గతంలో రోజుకు ఖర్చులు పోను రూ.500 నుంచి రూ.600 వరకు మిగిలేవని ఇప్పుడు కనీసం కూలీ కూడా గిట్టుబాటు కాక ఇంటి అద్దెలు, ఖర్చులకు అప్పు చేయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. చేతినిండా పని లేకపోవడం వల్ల ఆర్థికంగా నష్టపోయి అప్పుల బారిన పడుతున్నారు. మరికొన్ని కుటుంబాలు వలస పోతున్నాయి. ఆటో కార్మికులకు ఏటా డబ్బులు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చింది కానీ ఇప్పటివరకు ఎలాంటి లబ్ధి చేకూర్చలేదని, ఇప్పటికైనా స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

కాంగ్రెస్‌ను నమ్మితే మా కడుపు కొట్టిన్రు..

మహబూబాబాద్ రూరల్, మే 21 : పదేళ్ల నుంచి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. అసెంబ్లీ ఎన్నికలప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలు ఇచ్చింది. మాకు కూడా మేలైతదని నమ్మిన. కానీ, రేవంత్ సర్కారు మా కడుపు కొట్టింది. ఉచిత బస్సు సర్వీస్ అని పెట్టి ఆటోడ్రైవర్ల జీవితాలను ఆగం చేసింది. ఆటోలకు గిరాకీ మొత్తం తగ్గింది. రోజువారీ ఖర్చులు కూడా రావడం లేదు. మహబూబాబాద్ మండలం రెడ్యాల, కంబాలపల్లి, వేంనూరు, పర్వతగిరి అడ్డాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. వేంనూరు అడ్డా మీద రోజుకు కనీసం ఒక్కసారైనా నా బండి సీరియల్ రావడం లేదు. మహిళలు గంట లేటైనా ఆగి బస్సులోనే వెళ్తున్నరు. రోజువారీ ఖర్చులు కూడా ఇబ్బంది అవుతోంది. ఇల్లు గడవడం లేదు. కూలి పనులకు వెళ్లాల్సి వస్తున్నది. పిల్లల చదువు, కుటుంబ పోషణ భారమైంది. నెలవారీ కిస్తీలు కట్టకపోవడంతో ఆటోలను లాక్కోవడంతో కొందరు డ్రైవర్లు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలి.

– నలమాల సాయి, వేంనూరు, ఆటోడ్రైవర్

ఇదివరకు నాలుగు ట్రిప్పులు కొట్టేది..

నర్సంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత బస్సు స్కీమ్ పెట్టడం వల్ల మా ఆటో డ్రైవర్లకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఆటోలు నడపడం కష్టమవుతున్నది. ఇదివరకు నాలుగు ట్రిప్పులు కొట్టేది. పొద్దంత తిరిగినా ఒక్క ట్రిప్పు కూడా కొడుతలేం. నర్సంపేట నుంచి నెక్కొండకు రోజూ ఆటోలు నడిచేవి. ఇప్పుడు ఆటోల సంఖ్య తగ్గిపోయింది. నేను ఒక ట్రిప్పు నర్సంపేట నుంచి పోయి, మళ్లీ రావడానికి పొద్దుపోతున్నది. దీని వల్ల ఆర్థికంగా చాలా నష్టపోతున్నాం. ఇంకొన్ని రోజులైతే పిల్లల స్కూళ్లు కూడా ప్రారంభమవుతాయి. ఫీజులు, పుస్తకాలకు డబ్బులు ఎట్ల..? చేతిలో చిల్లిగవ్వలేదు. ఇగ అప్పులు చేయక తప్పదు. ప్రభుత్వం మా ఆటో కార్మికులను ఆదుకోవాలి.

– సిద్ధ ఉపేందర్, ఆటోడ్రైవర్, నర్సంపేట

ఫ్రీ బస్సుతో ఉపాధి కోల్పోయాం..

జనగామ చౌరస్తా, మే 21 : సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లం ఉపాధి కోల్పోయాం. ఆరు నెలల నుంచి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నం. ఒక రోజు కుటుంబం గడవాలంటేనే చాలా కష్టంగా ఉంది. గతంలో దేవరుప్పుల నుంచి జనగామకు రానుపోను ఆటో నడిపితే డీజిల్ ఖర్చుపోను రోజుకు రూ.1300 దాకా మిగిలేది. ఇప్పుడు పొద్దన్నుంచి కిరాయిల కోసం పడిగాపులు పడుతున్న. డీజిల్ ఖర్చుపోను రూ.500 కూడా ఎల్లే పరిస్థితి లేదు. ఇగ రేపో, మాపో స్కూల్లు తెరుస్తరు. మా పిల్లలకు పుస్తకాలు, కాపీలు కొనాలే, వాళ్లు అడిగినంత ఫీజు కట్టాలె. ఈ పరిస్థితిల ఇవన్ని ఎట్ల చేయాలే. ఇవేగాక రోజు కట్టే ఫైనాన్స్‌లు ఎట్ల ఎల్లదీయాలె. కాంగ్రెస్ వస్తే మార్పొస్తదని ఓటేస్తే, ఫ్రీ బస్సులతో మాకు ఉపాధి లేకుండా చేసిండ్రు. రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా మా ఆటోడ్రైవర్లకు న్యాయం చేసి ఆర్థికంగా ఆదుకోవాలి.

– మామిడి సైదులు, షేర్ ఆటో డ్రైవర్, కామారెడ్డిగూడెం, దేవరుప్పుల

ఉచిత బస్సు ప్రయాణంతో బతుకులు ఆగమైనయ్

భూపాలపల్లి రూరల్, మే 21 : కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోడ్రైవర్ల బతుకులు ఆగమైనయ్. నా పేరు భూక్యా కిరణ్. నాకు ఒక బిడ్డ, కొడుకు. బిడ్డ ఇంటర్ చదువుతుండగా, కొడుకు తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. కుటుంబ పోషణ, బతుకు దెరువు కోసం ఆటో డ్రైవర్‌గా గత 15 సంవత్సరాలుగా పనిచేస్తున్నాను. పెద్దకుంటపల్లి నుండి భూపాలపల్లి పట్టణానికి, కిరాయిలు వస్తే ఇతర ప్రాంతాలకు ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నాకు కష్టాలు మొదలైనయ్. మహిళల కోసం తీసుకొచ్చిన ఉచిత బస్సు ప్రయాణంతో కిరాయిలు రాక, గిరాకీ లేక మా బతుకుల బజారున పడ్డయ్. జూన్‌లో కాలేజీలు, స్కూల్స్ ప్రారంభం కానున్నాయి. మా పిల్లలకు ఫీజులు ఎలా చెల్లించాలో, బుక్స్, డ్రెస్సులు ఏవిధంగా కొనాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని, ప్రతి నెలా కొంత ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరుతున్నా.

– భూక్యా కిరణ్, పెద్దకుంటపల్లి, భూపాలపల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం మా పొట్ట మీద కొట్టింది



తమ గోడును చెప్పుకుంటున్న ములుగు జిల్లా ఆటో యూనియన్ నాయకులు

ములుగురూరల్, మే21: కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఫ్రీ బస్సులను పెట్టి మా పొట్టమీద కొట్టిందని ములుగు జిల్లా శ్రీ చైతన్య ఆటో యూనియన్ అధ్యక్షుడు గంట భగవాన్‌రెడ్డి, డ్రైవర్లు శ్రీను, పుల్యాల ధర్మేందర్, ఎండీ యాకూబ్, అన్నారపు భిక్షపతి, చిర్ర శోభన్‌బాబు, మామిడిపెల్లి రమేశ్, ఎండీ ఫరీద్ తమ గోడు వెల్లబోసుకున్నారు. 'తమ యూనియన్‌లో సుమారు 100 మంది డ్రైవర్లు ఉంటారని, అందరూ అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నాం. గతంలో మా వాహనాలను పట్టుకొని బయటకు వెళ్తే చేతి నిండా పైసలుండేవి. ఇప్పుడు ఇంట్లో బంగారం కాన్నుండి కుదవబెట్టి కిస్తీలు, టాక్సీలు కట్టాల్సి వస్తాంది. పొద్దుందాక అడ్డ మీద బండి పెట్టుకొని ఉంటే రూ.100 లేదా రూ.50 మాత్రమే వస్తున్నాయి. అవి కూరగాయాలకే సరిపోతున్నయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం చేస్తానని చెప్పి మోసం చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మా బతుకులు మంచిగ ఉండె. ప్రజలు ఆర్టీసీ బస్సులు ఎక్కినా కూడా మాకు చేతి నిండా పైసలు కనిపించేవి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఫ్రీ బస్సులను పెట్టి మా కుటుంబాల మీద దెబ్బకొట్టింది. ఫ్రీ బస్సును ఎత్తివేయాలె. ప్రభుత్వం ప్రైవేటు డ్రైవర్లను ఆదుకోవాలి. ప్రస్తుతం అన్ని వస్తువులు పిరమైనయ్. మాకు వచ్చే రూ. వంద, యాభై ఏం చేసుకోవాలె. ప్రైవేటు డ్రైవర్ల కుటుంబాల కోసం పార్టీలకతీతంగా అందరూ గళం విప్పాలి. మాకు అండగా ఉండాలి' అని ఆటోడ్రైవర్లు కోరారు.

– ఆటో యూనియన్ నాయకుల ఆవేదన

ఫ్రీ బస్సు పథకం తీసివేయాలి

హనుమకొండ : తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్రీ బస్సు పథకం తీసివేస్తేనే ఆటో డ్రైవర్ల కుటుంబాలు సంతోషంగా ఉంటాయి. ఈ పథకం ఇలాగే కొనసాగిస్తే ఆటోవాలల బతుకులు చిందరం అయ్యే ప్రమాదం ఉంది. గిరాకీలు లేకపోవడంతో రోజు వారి సంపాదన తగ్గింది. తద్వారా కుటుంబ పోషణ భారం అవుతుంది. అంతేకాక ఆటోలకు చెల్లించాల్సిన కిస్తీలు, మా పిల్లలకు బడి ఫీజులు కట్టే పరిస్థితి లేదు. కొందరు ఆటో డ్రైవర్ల పరిస్థితి అయితే దారుణంగా ఉంది. ఫ్రీ బస్సు పథకంతో ప్రభుత్వం అనుకున్నది జరుగడం లేదు. అందులో ఎక్కేవారంతా ఉద్యోగులు, ఉన్నత వర్గాల వారే. అలాగే ఆటో కిస్తీలు కట్టకపోతే ఆటోలు తీసుకెళ్తున్నారు. బడి ఫీజు కట్టకపోతే పిల్లలను బడికి రానివ్వడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఆటో డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వం మా సమస్యలను పరిష్కరించి మాకు దారి చూపించాలి.

– గన్నెబోయిన గణేశ్, ఆటోడ్రైవర్, వడ్డేపల్లి

కుటుంబ పోషణకు కష్టంగా ఉంది

వర్ధన్నపేట, మే 21: ఆటోపైనే నా కుటుంబం బతుకుతున్నది. ప్రతి రోజూ వర్ధన్నపేట నుంచి వరంగల్, జఫర్‌గడ్, ఇతర రూట్లలో ఆటోను నడిపేటోన్ని. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అమలు చేస్తుండడంతో ఉపాధి పూర్తిగా పోయింది. కుటుంబ పోషణకు ఇబ్బందైతాంది. పిల్లలకు బడి ఫీజులు ఎట్లా కట్టాలో తెల్వడంలేదు. మా పరిస్థితి దయనీయంగా తయారైంది.

– భూక్యా బాలాజీ, డీసీ తండా, వర్ధన్నపేట

23న హరీశ్‌రావు రాక

భూపాలపల్లి, తొర్రూరులో ఎమ్మెల్సీ సన్నాహక సమావేశాలు

తొర్రూరు/కృష్ణకాలనీ, మే 21: ఈ నెల 23న పాలకుర్తి నియోజకవర్గ పట్టభద్రులు, బీఆర్ఎస్ శ్రేణుల సమావేశాన్ని తొర్రూరులో నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వెల్లడించారు. మంగళవారం తొర్రూరులో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ 23న మధ్యాహ్నం 2 గంటలకు తొర్రూరులోని పీఎస్ఆర్ స్కూల్ ఆవరణలో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరవుతున్నారని చెప్పారు. అలాగే భూపాలపల్లిలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న పట్టభద్రుల నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి హాజరవుతారని పార్టీ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ తెలిపారు. విజయవంతం చేయాలని కోరారు.

కేయూ ఇన్‌చార్జి వీసీగా వాకాటి కరుణ

హనుమకొండ చౌరస్తా: కాకతీయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి వాకాటి కరుణను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త వీసీల నియామకానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉండటంతో ఇన్‌చార్జి వీసీలను నియమించింది. కేయూ వీసీ నియామకం కోసం ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం ప్రొఫెసర్ల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. వీటిని పరిశీలించి వీసీ పేర్లను సిఫార్స్ చేయడం కోసం సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉండగా కేయూకు మాత్రం సెర్చ్ కమిటీ ఏర్పాటు చేయకపోవడంతో ఇప్పట్లో వీసీల నియామకం లేనట్లుగానే కనిపిస్తోంది. తాటికొండ రమేశ్ పదవీకాలం మంగళవారంతో ముగియడంతో వాకాటి కరుణను ఇన్‌చార్జి వీసీగా నియమించింది.